క్లుప్తంగా

సందడిగా రక్షా బంధన్ వేడుకలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెంలో గల శ్రీ గన్నాథ స్వామి దేవాలయంలో ఆదివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లికి చెందిన ఆర్ఎస్ఎస్ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయుడు శాస్త్రి, న్యాయవాదులు సత్యనారాయణ, నలమోతు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏ.ఎస్.కె.వి.రంగారెడ్డి పాల్గొన్నారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అనే నినాదాన్ని వారితో పలికించారు. అనంతరం ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు, బాల వికాస చిన్నారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశక్తి దుర్గా పీఠం బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు కలవకొలను సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మంగళ వాయిద్యాల మధ్య విఘ్నేశ్వర పూజ, ప్రసన్నాంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభను 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి ప్రారంభించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. అమ్మవార్లకు 108 కేజీలతో అన్నాభిషేకం చేసి, మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. ఏర్పాట్లను పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్‌స్వామి పర్యవేక్షించారు.

జూదరుల అరెస్టు

నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్లలో నాగేంద్రస్వామి పుట్ట సమీపంలో పలువురు రహస్యంగా పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం దాడి చేసినట్లు ఎస్ఐ ఏ.బాలకృష్ణ తెలిపారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, రూ. 26,570 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంటి ముంగిట సంక్షేమ వసంతం

- రాష్ట్ర జలనవరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నార్నెపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన



నార్నెపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

నార్నెపాడు(ముప్పాళ్ల): ప్రజల నీరాజనాల మధ్య సాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. అందరినీ పలకరిస్తూ...ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరిస్తూ.. మీకేం కావాలని ఓట్లేసి గెలిపించిన నేతలు ఇంటి ముంగిటకే వచ్చి అడుగుతుండటంతో జనం కళ్లలో సంతోషం కన్పిస్తోంది. మండలంలోని నార్నెపాడులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి అంబటి ఇంటింటికీ వెళ్లారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశామో, ఇంకా ఏం కావాలో ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ, సంక్షేమ పుస్తకాన్ని ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వంలో పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధి అందిందని నమ్మితే ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. ప్రతి కుటుంబంలో నాలుగు నుంచి ఐదు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డికి తాము అండగా ఉంటామని స్పష్టం చేయడం గర్వంగా ఉందని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ప్రతిపక్షాలు కేవలం ఉనికి కోసమే విమర్శలు చేస్తున్నాయని, వాటికి ప్రజల మధ్యకు వెళ్లే ధైర్యం లేదని విమర్శించారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశరాజకీయ చరిత్రలో ఏ నాయకుడు సాహసించని రీతిలో సంక్షేమ పరిపాలన, సంస్కరణల్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరిగిరి చంద్రకళ, ఎంపీటీసీ సభ్యురాలు మనికె ఏసమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ ఎం.జె.ఎం. రామలింగారెడ్డి, యనమాల సింగయ్య, నక్కా శ్రీనివాసరావు, శిరిగిరి గోపాలరావు, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనుమూరి బాబు, చిన్నపురెడ్డి కృష్ణారెడ్డి, గోవిందు శ్రీనివాసరెడ్డి, పాలూరి కోటిరెడ్డి, పాలడుగు అప్పయ్య, కనుమూరి సైదారావు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

హాజరుకానున్న మంత్రి అంబటి రాంబాబు



తహసీల్దార్ కార్యాలయ భవనం

సత్తెనపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రారంభించనున్నారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంలో కార్యాలయం శిథిలావస్థకు చేరి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలోనే అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వస్తే అంతా తడిచి పోతోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది నానా యాతన పడుతున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నిర్మాణానికి పూనుకుంది. కానీ మధ్యలోనే వదిలేయడంతో శిథిలావస్థకు చేరిన భవనంలోనే ఉద్యోగులు కాలం గడుపుతూ వచ్చారు. ఇటీవల కురిసిన వర్షానికి కార్యాలయం పూర్తిగా నీటితో నిండి పోయింది. గత పాలకులు అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, ప్రారంభోత్సవం చేసేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకున్నారు. రూ. 1.2 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, దాని పైనే నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మాణం కోసం రూ. 17.5 లక్షల్ని మంత్రి అంబటి రాంబాబు మంజూరు చేయించారు. త్వరలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం భవనం, పైన ఏర్పాటుచేసిన నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, హాజరుకానున్నారు. ఎన్జీవో హోం వైపు నుంచి కార్యాలయానికి రాకపోకలు సాగేలా గేట్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు ఏళ్లనాటి సమస్యకు మంత్రి చొరవతో పరిష్కారం లభించింది.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బాబూరావు

సత్తెనపల్లి: విద్య ద్వారానే సామాజిక మార్పు వస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో కార్డు సంస్థ ఆదివారం ఏర్పాటు చేసిన బాలబాట శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణకు పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ దళితులు ఎదగాలంటే విద్య అవసరమని తెలిపారు. బాపట్ల డెప్యూటీ డైరెక్టర్ ఏ.సాంబశివరావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియాలో విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించేందుకు అవసరమైన తర్ఫీదు కార్డ్స్ సంస్థ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా ఏడు రకాల కూరగాయల విత్తనాల్ని బాలబాట డెవలప్‌మెంటు ఆర్గనైజర్లు ద్వారా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ రవి, డెవలప్‌మెంటు ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం కేసులో నాగేంద్రకుమార్ అరెస్టు

అమరావతి: మండలంలోని ధరణికోటకు చెందిన దండా నాగేంద్రకుమార్ తెలంగాణ నుంచి మద్యం తరలిస్తుండగా ఆదివారం అమరావతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచడానికి ఆయన్ను అమరావతి నుంచి తరలించారు. ఈ సందర్భంగా సీఐ ఎ. బ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ నిందితుడు నాగేంద్రకుమార్ తెలంగాణ నుంచి 59 బాటిళ్ల మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అమరావతి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సత్తెనపల్లి తరలిస్తుండగా నాగేంద్రకుమార్ భార్య కుటుంబసభ్యులు, అనుచరులు తమ వాహనాన్ని అత్యుత్సాహంతో అడ్డగించి తమ విధులకు అటంకం కలిగించే ప్రయత్నం చేశారని వివరించారు. తాము చట్టబద్ధంగా అరెస్టు చేశామని, కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించామని తెలిపారు.

ఇందేం 'శునక' వాదన..!

- మాచవరం ఎంపీడీవో శునకానికి సుస్తి
- బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లిన అధికారి
- పశువుల వైద్యశాలకు వెళ్లాలని సూచించిన సిబ్బంది
- పేషెంట్ బెడ్‌పై పడుకోబెట్టి వైద్యం చేయాల్సిందేనని వాదన
- సర్దిచెప్పిన అవుట్ పోస్టు పోలీసులు

బాపట్ల టౌన్: పెంపుడు కుక్కకు ఆరోగ్యం సరిగా లేదు...తక్షణమే వైద్యసేవలు అందించాలంటూ పల్నాడు జిల్లా మాచవరం ఎంపీడీవో వరప్రసాదరావు ఆదివారం బాపట్ల ఏరియా వైద్యశాలలో హల్‌చల్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన వరప్రసాదరావు మాచవరంలో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తుంటారు. ఆదివారం పెంపుడు కుక్కను ఏరియా వైద్యశాలలోని అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లారు. బెడ్‌మీద పడుకోపెట్టి తక్షణమే వైద్య సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. ఇది ఏరియా వైద్యశాల...ఇక్కడ మనుషులకు మాత్రమే వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు. పట్టణంలోని పశువుల వైద్యశాలకు వెళ్లాలని సిబ్బంది చెప్పినప్పటికీ సదరు ఎంపీడీవో వినిపించుకోలేదు. వెంటనే వైద్యశాల అవుట్ పోస్ట్ పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పి, అక్కడి నుంచి ఎంపీడీవోను పంపించి వేశారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



మంత్రి అంబటికి నూతన వస్త్రాలు అందిస్తున్న కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి

సత్తెనపల్లి: పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి నివాసంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి, ఆమె కుమారుడు శ్రీనివాసరావు, భార్య కోటేశ్వరి మంత్రి అంబటికి స్వామి ప్రసాదంతో పాటు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, అచ్యుత శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ పురస్కారాలకు ఐదుగురు ఉపాధ్యాయుల ఎంపిక

సత్తెనపల్లి: గురు సత్కారోత్సవం -2023ను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని భవిష్య పాఠశాల ఆవరణలో ఐదుగురు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) ఓరుగంటి శ్రీకాంత్, కంకణాలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్టీటీ వి.వి. గోపాలకృష్ణమూర్తి, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ లాకు పిచ్చయ్య, సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. ప్రసన్నరాణి, సత్తెనపల్లి శ్రీ బాబా గురుదేవ్ కళాశాల అధ్యాపకురాలు అబ్బూరి మంజరీదేవికి పురస్కారాల్ని అందజేయనున్నట్లు చెప్పారు. మాస్టర్ ఆఫ్ సెర్మనీగా లయన్ వై.పి. మురళీకృష్ణ వ్యవహరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఏ.వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా ఉపాధ్యాయుడు, పాఠ్య పుస్తక రచయిత, సంపాదకుడు శ్రీనివాసుల రఘురాం, ఆత్మీయ అతిథులుగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ తోట చిన్న సాంబశివయ్య, డిస్ట్రిక్ చైర్మన్లు ఎంజెఎఫ్ కోట వెంకటేశ్వర్లు, కంబాల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ప్రజల్ని కోరారు. సమావేశంలో కార్యదర్శి లయన్ వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి లయన్ తోట పద్మ, ప్రోగ్రాం చైర్మన్ లయన్ తవిటి భావనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ రజనీకాంత్

సత్తెనపల్లి: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాల్ని ఎంచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దాసరి రజనీకాంత్ సూచించారు. పట్టణంలోని వేద బాలుర కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశల్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకోవాలని తెలిపారు. మార్కుల కోసం చదవ వద్దని, విషయ పరిజ్ఞానం అవసరమని సూచించారు. చర్మ వ్యాధి నిపుణులు శివన్నారాయణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే చదువుతో పాటు నైపుణ్యం కలిగి ఉండాలని చెప్పారు. అందివచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా జీవితంలో స్థిరపడాలని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్, అధ్యాపకులు సింధూష, నాగలక్ష్మి, విజయశాంతి, రవికుమార్ నాగరాజు పాల్గొన్నారు.

అచ్చంపేటలో భారీ వర్షం



మాదిపాడు రోడ్డుపై నిలబడిన వర్షపు నీరు

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభమైన వర్షం ఉదయం 6గంటల వరకు కుండపోతగా కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. మాదిపాడు రోడ్డులో మోకాళ్ల లోతు నీళ్లు నిలబడటంతో రెండు గంటలపాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వర్షపు నీళ్లు చుట్టు ముట్టాయి. హైస్కూలు గ్రౌండ్‌లో నీళ్లు నిలబడ్డాయి. అచ్చంపేట-సత్తెనపల్లి రహదారిలోని వాగుపై నీళ్లు పారడంతో కొద్దిసేపు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. రెండు నెలలుగా వర్షాలు లేక అల్లాడిన పత్తి, మిర్చి రైతుల సాగునీటి దాహార్తి పారింది. పొలాల్లో వర్షపు నీళ్లు పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇదే పెద్ద వర్షంగా మండల ప్రజలు చెప్పుకుంటున్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వం



ప్రచారం చేస్తున్న సీపీఎం నేతలు

క్రోసూరు: సబ్సిడీ, రుణమాఫీల పేరుతో లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందని సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిసెట్టి హనుమంతరావు ధ్వజమెత్తారు. సంపద మరింత పెరిగే విధంగా నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, నిరుద్యోగాన్ని అరికట్టాలని కోరుతూ సోమవారం క్రోసూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నేతలు చిలుకా ఏషియా, గంటెల చిన్నప్ప పాల్గొన్నారు.

నేత్ర దానం.. చూపు సజీవం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటే శరీరంలోని అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధాన మైనవి అని అర్థం. అయితే, కొందరు పుట్టుకతో అంధులుగా, మరికొందరు ప్రమాదాల బారిన పడి కళ్లు కోల్పోయి జీవిస్తుంటారు. ఇలాంటి వారికి నేత్రదానం చేస్తే వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించినవారమవుతాం. ఈ దిశగా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత నెల 25 నుంచి ఈ నెల 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది.

- నేత్రదానంపై ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- మూఢ నమ్మకాలతో ముందుకు రాని పలువురు
- ఈ నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నేత్రదాన పక్షత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న రామకృష్ణ, వైద్యులు

సత్తెనపల్లి: నేత్రదానంపై ప్రజలు ఇంకా మూఢ నమ్మకాలు వీడటం లేదు. అనారోగ్యంతో, ప్రమాదాల్లో ప్రతి రోజూ ఎంతో మంది చనిపోతున్నా చేసేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. దీనికి ప్రధాన కారణం మూఢ నమ్మకం. చనిపోయాక కళ్లు తొలగిస్తే మరుజన్మలో గుడ్డి వారిగా జీవిస్తారని, వారి ఆత్మలు సైతం కళ్లు లేకుండా తిరుగుతాయని చాలా మంది భావిస్తూ ఉంటారు. ఇది భ్రమ మాత్రమే.ఒకరి నేత్ర దానం మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదిస్తుంది. దీనివల్ల చనిపోయినా కూడా ఈ ప్రపంచాన్ని వారి కళ్లతో చూసే గొప్ప అవకాశం మనిషికి కలుగుతుంది. ఈ దిశగా వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పిస్తుండటంతో ఇటీవల ముందుకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇందులో భాగంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా అధికారులు, టెక్నీషియన్లు సైతం ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. మనిషి మరణించిన ఆరు గంటల్లోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రం/ ఐ బ్యాంక్‌కు వివరిస్తే వారు వచ్చి నేత్రాల్ని సేకరిస్తారు. అనంతరం వారికి కృత్రిమ నేత్రాల్ని అమర్చడం ద్వారా అవయవ లోపం కనిపించదు. ఇలా సేకరించిన వాటిని నేత్ర వైద్యశాలకు పంపిస్తున్నారు. అక్కడ నేత్రాలు అవసరమైన వారికి అమర్చి చూపును ప్రసాదిస్తున్నారు.

కనుగుడ్డు ఎలా దెబ్బతింటుందంటే..

కార్నియా అంటే కంటిలోని పల్చటి పారదర్శక పొర. కనుపాప ముందర ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ ద్వారా, దెబ్బతగలడం, ఆహారలోపం (విటమిన్ -ఏ, విటమిన్- డి) వల్ల మసకబారి తెల్లని పొర ఏర్పడుతుంది. ఈ కారణంగా కంటిచూపు కోల్పోతారు. పుట్టుకతో తల్లి గర్భంలో ఇన్ఫెక్షన్ రావడం వల్ల నల్లగుడ్డు ఏర్పడే సమయంలో తెల్లబడి ఉంటుంది. ఇది వైరల్, ఫంగల్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్. దీని బారిన పడిన వారికి దాతల నుంచి సేకరించిన నల్లగుడ్డును అమర్చడం ద్వారా కంటిచూపు వస్తుంది.

కార్నియా దానానికి అర్హులు

ఆడ, మగవారు ఏ వయస్సు వారైనా చేయవచ్చు. షుగర్, బీపీ, కొన్ని వ్యాధుల వల్ల చనిపోయిన వారు కూడా అర్హులు. కుక్కకాటుతో (రేబిస్ వ్యాధి), హెచ్ఐవీ / ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధితో చనిపోయిన వారి నేత్రలు దానానికి పనికిరావు.

నేత్రాలను ఎలా సేకరిస్తారంటే ..

నేత్రదానం చేసే వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి చార్జీలు (ఫీజు) ఉండవు. ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి ఇళ్ల వద్ద సేకరిస్తారు. సేకరించిన నేత్రాల్ని విక్రయించడం, కొనడం కానీ జరగదు. ఉచితంగా ఇతరులకు అమరుస్తారు.

నేత్రదానానికి ముందుకు రావాలి



ప్రతి రోజూ ఎంతోమంది చనిపోతున్నా నేత్రదానానికి ముందుకు రావడం లేదు. ఒకరి నేత్రదానంతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. ఇప్పటికీ ప్రజల్లో అనుమానాలు, అపోహలు, మూఢనమ్మకాలు ఉన్నాయి. మరణించిన అనంతరమే వ్యక్తి కళ్ల నుంచి కార్నియాను వైద్యసిబ్బంది సేకరిస్తారు. దాని స్థానంలో కృత్రిమ కార్నియాను అమరుస్తారు. దీనివల్ల మరణించిన వ్యక్తికి అవయవలోపం కనిపించదు.

–కొత్తా రామకృష్ణ,
ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్, సత్తెనపల్లి

మూఢ నమ్మకాలు వీడాలి



నేత్రదాన పక్షోత్సవాల్ని పురస్కరించుకొని విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. గతం కంటే ఎక్కువ మంది చదువుకుంటున్నందున మూఢ నమ్మకాలు వీడి నేత్రదానం చేసి, ఇతరులకు చూపు ప్రసాదించాలి. ఇప్పటికే ఏరియా వైద్యశాలలో 15 మంది సిబ్బంది, మరో నలుగురు బయటి వ్యక్తులు నేత్రదానానికి ముందుకు వచ్చి హామీ పత్రాలు ఇచ్చారు. ఈ నెల 8వ తేదీ వరకు నేత్ర దాన పక్షోత్సవాలు ఉన్నందున మరింత మంది ముందుకు రావాలి.

–డాక్టర్ బి.లక్ష్మణరావు, సూపరింటెండెంట్,
ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

పల్నాడులో భారీ వర్షం

- పొంగిన వాగులు... నిలిచిన రాకపోకలు
- ముంపునకు గురైన పంట పొలాలు



పాత పాలువాయి, కొత్త పాలువాయి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లి వాగు

రెంటచింతల: పల్నాడులో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అగ్నిగుండాన్ని తలపించే రెంటచింతలలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. 135.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కట్టికోట పుల్లారావు తెలిపారు. మూడు నెలలుగా తీవ్ర వర్షాభావంతో అల్లాడిన రైతులు ఒక్కసారిగా వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటల పాటు కురిసిన వర్షానికి రెంటచింతల, రెంటాల, మిట్టగుడిపాడు గ్రామాల్లో గోలి, ఏడుమంగళం వాగులు, పాలువాయి, పశర్లపాడు గ్రామాల్లో పిల్లి వాగు పొంగి పొర్లాయి. ఆయా గ్రామాల్లో కొంతమేర పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గోలి వాగు వద్ద ఎస్ఐ జె. సామెల్ రాజీవ్ కుమార్ సిబ్బందితో జాగ్రత్త చర్యలు చేపట్టారు. వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో కొన్ని గంటలపాటు పలు గ్రామాలకు రాకపోకలు నలిచిపోయాయి. రెంటచింతలలోని శివాలం సమీపంలో రహదారులపై, పశువైద్యశాల వద్ద, స్థానిక రేగుల మాణ్యం కాలనీలలో భారీగా వర్షపునీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఆరోగ్యపురం, వెంకటేశ్వరస్వామి మాణ్యం కాలనీ మధ్య కల్వర్టుకు చెట్ల కొమ్మలు, చెత్త అడ్డుపడంలో కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

గురజాలలో..

మండలంలో శనివారం రాత్రి అర్ధరాత్రి గంటకు పైగా కురిసిన వర్షం పత్తి, మిరప పంటలకు జీవం పోసింది. గత కొద్ది రోజులుగా భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. పంటలు వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఆశలు సన్నగిల్లాయి. ఈ సమయంలో రాత్రి కురిసిన వర్షం కొంతమేరకు ఉపశమనం లభించిందనే చెప్పవచ్చు. రహదారులు జలమయమయ్యాయి. మండలంలో 77 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

దుర్గిలో...

మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పలు వాగులు, చెరువులు నిండి కళకళలాడుతున్నాయి. వైఎస్సార్ వర్ధంతి రోజు వర్షం కురవడంతో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. మిరపనారు, వివిధ పంటలు సాగు చేసి విత్తనాలు వేయడానికి సిద్ధమయ్యారు. ఆత్మకూరు చెరువుతో పాటు పలు గ్రామాల్లోని చెరువులు నీటితో నిండిపోయాయి. వర్షం కురవడంతో భూగర్భ జలాలు పెరిగి, నీటి సమస్య తీరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల దుకాణాల వద్ద, నర్సరీల వద్ద రైతుల సందడి నెలకొంది. ముటుకూరు వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సాగర మాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురి సౌత్: సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. ఉదయం కృష్ణా నదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.